# చరిత్ర చక్రం

## బుద్ధరాజు సన్యాసిరాజు

అనంతకోటి జీవరాశిని సుషుప్తినుంచి చేతనావస్థకి తెచ్చే బాలభానుని పసిడి కిరణాలు ధరాతలాన్ని తాకి పరుగులు పెడుతున్నాయి

విద్యుత్తరంగాలు సోకి కదలిన యంత్రాల్లా, సౌర తాకిడికి జాగృతికొస్తోంది, జీవకోటి

క్రమంగా ఆకాశంలో మబ్బుక్రమ్మి, దట్టమైంది

పసిమి సూర్యుడు పరువానికి రాకముందే మాయమైనాడు, కుట్రవల్ల

మిధ్య, ఐహికాలమధ్య మానవుడు పొందే అనుభూతిలా – రాత్రి, పగలు కాని సంకీర్ణాన్ని ప్రకృతి అనుభవిస్తోంది

క్షణకాలం తుంపరపడి, ఆగింది

మబ్బు విడలేదు

పరిణామక్రమాన్ని జీర్ణించుకొన్న ప్రాణికోటి, ఈ కుటిలాన్ని పట్టించుకోలేదు

అంగుళం పొట్టకై అనంతాన్ని సర్వే చేసే పక్షులు రెక్కలు విదిల్చి, తమ కార్యక్రమానికి నాందీ పలికాయి

ప్రకృతి ధర్మాన్ని పాటిస్తూ 'ఆ' పల్లెకూడా మేల్కొంది

పల్లెకు అల్లంత దూరాన ఉన్న 'మాలపల్లె' (క్షమించాలి, పల్లెల్లో 'హరిజనవాడ'లను ఇప్పటికీ ఇలాగే పిలుస్తారు) కూడా మేల్కొంది

నాయకుల అవసరార్థం దానికి స్వతంత్ర పాలనా ప్రతిపత్తి ఇవ్వకపోవటంచేత అది ఆ పల్లె అంతర్భాగమే

ధర్మ విరుద్ధమైనా, అందులో నివసించే వాళ్లంతా 'అస్పృశ్యులు' (వాళ్లదృష్టిలో) కాబట్టి, వాళ్లని ఆ మాత్రం దూరం వుంచుతారు

దాన్లో నివసించేవాళ్ళు చాలామంది వెట్టిచాకిరీ చేత తాళి కట్టించుకున్నవాళ్లు

ఆ మాలపల్లె పెద్దపైడియ్య, ముసలివాడు – 'పైడియ తాత' అంటారు అక్కడివాళ్లు

* * *

వీధిలో గోళీలాడుకుంటున్న పిల్లలు దూరంగా ఏదో శబ్దాన్ని గ్రహించి, 'కారొత్తంది, కారొత్తంది' అని అరుస్తూ, దాన్ని చూసే ఆతృతలో పరుగెత్తారు

సరిగ్గా ఈ ఘడియల కోసమే వీధి చావడిలో కాపేసిన ప్రెసిడెంటు గాబరాగా లేచి, కండువా కోసం కేకేసి, భజన జనం వెంటరాగా, చప్పున వీధిలోపడి, కారు కెదురెళ్లాడు

అనివార్య కారణాల వల్ల అనధికారులయిన మంత్రిగారు మరో నలుగురితో వచ్చి, రావిచెట్టు దగ్గరే కారు ఆపమని డ్రైవర్‌తో చెప్పి, రాజ లాంఛనాలతో కారులోంచి దిగకుండా, ఆగిందే తడవుగా 'డోరు' తోసుకొని బాహ్య ప్రపంచంలోకి ఛంగున గెంతి, మాలపల్లె వేపు పరుగు లాంటి నడకతో నిష్క్రమించారు—

ఊహించని పరిణామానికి బురద గుంటలో ఆడుకుంటున్న పందికూన 'కుంయ్'మని, బురద జల్లుకుంటూ ప్రాణ భీతితో పరుగెత్తింది—

రావిచెట్టు నీడన కుచ్చిటప్పాలాడుతున్న యువత అయోమయంగా చెట్టుకోపిట్టగా జారుకున్నారు

'పనిగట్టుకుని తనవద్దకే వస్తున్నాడనుకున్న మంత్రిగారు తనని కనీసం కన్నెత్తి చూడకుండా, అటు పరుగు లంకించుకోవడమేమి చెప్మా!' అని ప్రెసడెంటు ఆశ్చర్యపోయి, తేరుకుని 'చంచలముల్ శ్రీవార్ల చిత్తముల్' అని సర్దిచెప్పుకున్నాడు

శ్రీవారితోపాటు కారులో వచ్చినవాళ్లకిది దినచర్య గాబట్టి వాళ్ల మొహాల్లో ఏ 'ఎక్స్‌ప్రెషనూ' ఎక్స్‌పోజు కాలేదు

* * *

వగరుస్తూ మాలపల్లె చేరిన మంత్రిగారికి 'వెదకంబోయిన తీవ కాలికే తగి'ల్నట్టు, పైడియ తాత కుంకుడుచెట్టు వేళ్లమీద కూర్చుని 'పలక్ర' (పళ్లు తోముకోవటం) చేస్తూ కనిపించాడు

ఖద్దరు బట్టల శాల్తీని అల్లంత దూరంలో చూస్తూనే 'మళ్లీ ఎలచ్చన్లొత్తన్నాయి గావాల' అని మనసులోనే అనుకొని, లేచి నిలబడ్డారు – తాత చుట్టూ వున్న జనం

శ్రీవారు వస్తూనే, వెనుదిరిగున్న తాత భుజం తట్టి —

"ఏం పైడియ మాఁవా, కులాసాగున్నావా ?"
అని పలకరించారు

'ఏదో నిన్ను నిలబెట్టిన దౌర్భాగ్యానికి' అని స్వగతంగా అనుకుని —

" యిలాగున్నాం" అన్నాడు తాత

"లచ్చప్ప ఏది మాఁవా ? దాన్ని సూసి సాలాకాలఁవైపోయింది "

"అది సచ్చి ఏడాది దాటింది మీ ధర్మమా అని, ఈ వూళ్లో అస్పత్రి కూడా లేదుగాదా మరీ "

"ఓసీ ఎంత పనయిపోయిందీ దాన్ని నీ ప్రేణంలాగ సూసుకున్నావు నిన్నొక్కన్నిసేసి ఎల్లిపోయింది బగమంతుడికి నీలాటోల్లమీదే గురి " అని,

" ఏరోయ్, అప్పిగా, పిల్లలు బాగున్నారా?"
అని పరామర్శించాడు ప్రక్కనే ఉన్న అప్పన్నని

'నాకు పెళ్లిగానైపోయిందేటి సెప్మా !' అని కాసేపు తికమకపడ్డాడు, సదరు అప్పన్న

ప్రక్కనుంచే వెళ్తున్న వీరమ్మను చూసి –

"ఏఁవే యూరీ ! ఓసోస్ అప్పుడే మేం కానోల్లమైపోయామే సూసీ సూడనట్టు ఎల్లిపోతన్నావు " అని బాధ నటించారు శ్రీవారు

కుంకుడుచెట్టు వేరుకి కట్టిన కోడెదూడ ఆకలికి 'అంబే' అని అరిచింది

తన పరామర్శలకి దూడ 'గేలి' చేస్తోందేమోనని సిగ్గుపడబోయి, 'దానికేటి తెలుస్తదిలే' అనుకుని, తమాయించుకున్నారు

వెనకాలే వున్న చిన్నయ్యను చూసి –

"ఒరే సిన్నా ! కొంచెం కాఫీ పట్రారా' అనబోయి నాలిక్కొరుచుకొని –

"సిన్నా కాసిన్ని మజ్జిగనీల్లుంటే పట్రారా మహ దాహఁవేస్తంది యదవబతుకు కాలీసు లేదు తెల్లారిందగ్గర్నించీ " అని, పైడియ తాత ప్రక్కనే వేరుమీద కూలబడ్డారు

విధిలేక లేచాడు పైడియతాత 'తుపు'క్కున ఉమ్మి

మజ్జిగెప్పుడూ చూడని చిన్నయ్య 'అదేం'టని అడగడానికి జంగాడు

ఇలా పరామర్శలూ, చమత్కారాలూ ముగించుకొని పన్లోకొచ్చారు శ్రీవారు

లేచి, పైడియ్యను పక్కకి తీసుకెళ్లి—

"మాఁవా నీతో కొంచెం సీక్రేటుగా మాటాడాల, పన్జూసుకోనొకసారి, పెసిడెంటు గోరింటికి రాగలవేటి ?"

రాజకీయాల్లో పండకపోయినా, పండిపోయిన పైడియ తాతకు రాజకీయాల స్వరూపం, నాయకుల భాషా ప్రావీణ్యం తెల్సు– పంచాయితీ ఎలక్షన్లతో కలిపి ఓ పది పదిహేను చూసాడు గాబట్టి

"వొత్తాలే" అన్నాడు ముక్తసరిగా

* * *

ప్రెసిడెంటు గారింటి కెళ్లాడు తాత పన్జూసుకుని

ప్రెసిడెంటుగారు, మంత్రిగారు తననోగదిలోకి తీసుకెళ్లారు

కుర్చీలో కూర్చోమన్నారుగాని, తాత నేలమీదే కూర్చున్నాడు

మంత్రిగారొచ్చిన విషయం వివరించబోయాడు ప్రెసిడెంటు

"నాకు తెలు"సన్నాడు తాత

'ఎలా తెలు'సని ఎవరూ ప్రశ్నించలేదు

" మరి నీకంతా తెలుసుగదా మన మాలపల్లంతా నీ మాటమీద నిలబడతారు నువ్వు సెప్తే ఒక్క వోటు కూడా బయటికి పోదు " అన్నాడు ప్రెసిడెంటు

"గాని, నేను సెప్పను" మొండిగా తాత

"నువ్వుత్తిపున్నేనికే సెప్పక్కర్లెద్దులేరా శ్రీవారు మహానుబావులు నీ కష్టముంచుకోరు నువ్వు 'ఊఁ' అంటే ఇప్పుడే సెల్లిత్తారు "

ఒళ్లు మండింది తాతకు

'నేను ఊఁ అనను' అనలేదు కాని,

"ఎయ్యమని సెప్పడానికి కట్టమెందుకూ – ఎయ్యొద్దని సెప్పడానికి కట్టపడాలగాని " అన్నాడు

సూక్ష్మబుద్ధి అయిన శ్రీవారు పరిస్థితి గ్రహించారు పైడియ్యను 'లైను'లోకి తేవడానికి

ప్రయత్నిస్తూ హరిజనోద్ధరణ గురించి ఏకరువు పెట్టాడు. 'మన కులం బాగుపడాలంటే మనమే ఉండా'లన్నాడు... లాభం లేకపోయింది

చివరి ప్రయత్నంగా —

"నీ గడ్డ్రవేదీ ?" అన్నారు.

"నిన్ననే గీయించిసినాను. సేతికి దొరకదు"

"సేతులేవీ ?"

"సల్ది గెంజి తాగి సరిగా కడుక్కోకుండా వొచ్చేసినాను."

"కాళ్ళో ?"

"సెప్పుల్లేక దుమ్ము కప్పేసినాది"

వాళ్ళు బయటికి పొమ్మనక పోయినా, గుడిసె కెళ్ళడానికి బయటికే రావాలి గాబట్టి వచ్చేసాడు పైడియతాత.

తాతను తన వాక్చాతుర్యంతో లోబరుచుకో



లేకపోయినందుకు బాధపడుతూ కూర్చున్నారు మంత్రిగారు.

పథకమాలోచిస్తున్న ప్రెసిడెంటు; నిశ్చయంగా, నిశ్చలంగా అన్నాడు —

"దీని గురించి మీరేం యిదయిపోకండి...అన్ని వోట్లూ మీకేయేయించే పూసీనాది...ఒక్కటి తప్ప."

"మీదా ?" అన్నాడు తెల్లబోయి, మంత్రిగారు.

"కాదు — ఆ ముసిలాడిది" సందేహనివృత్తి చేసాడు ప్రెసిడెంటు. అంతకంటె వివరాలు మంత్రి గారడగలేదు, ప్రెసిడెంటు చెప్పనూలేదు.

కారెక్కి తుర్రుమన్నాడు మంత్రిగారు. శ్రీవారిని సాగనంపి ఇంట్లోకొచ్చిన ప్రెసిడెంటు, కుర్చీలో లావుపాటి పర్సుచూసి, 'అరె మర్చిపోయినట్టున్నా'డని అనుకోలేదు.

* * *

భవిష్యత్తును కొంతవరకు ఊహించగలరు జ్ఞానులు...

'ఈ రోజేదో అనర్థం జరిగేలా వుంది నా కళ్లతో చూడటమెందుకూ' అని శలవు పెట్టాడు చంద్రుడు

'ఈ రోజు నాకేదైనా అనర్థం జరుగుతాది' అని కీడు శంకించి, రోజూ బయట చెట్టుక్రింద పడుకుంటున్న పైడియ తాత ఆ రోజు గుడిశెలో దూరి, తలుపుకు గడియ పెట్టుకున్నాడు

నిద్ర రాకుండా ప్రయత్నించాడుగాని, ఉదయం నుంచీ అలసిపోయిన బుర్ర విశ్రాంతి కోసం పైడియ తాతను లొంగదీసుకుని నిద్రాదేవిని ఆహ్వానించింది

దాదాపు పల్లె అంతా గాఢనిద్రలో వుంది ఆ రాత్రి రెండు గంటలవేళ — ఒక్క ప్రెసిడెంటు యిల్లు తప్ప.

అదే వేళ...

జ్ఞానులు ఊహించిన అనర్థం, మాలపల్లెలో మంటల రూపంలో బయటికొచ్చింది.

వాడ ప్రజలు మేలుకొని పరిస్థితి గ్రహించే సరికే చాలా యిళ్లు దగ్ధమైనాయి.

వాయువు సహాయంతో వీరవిహారం చేసిన మంటలు ప్రజల ప్రయత్నాలపై విజయం సాధించాయి.

పైడియ తాత కోసం వెదికారు కొంతమంది.

తాత కనిపించలేదు.

తాత ఉండే పాక కూడా లేదు!

* * *

తెల్లవారింది...

భర్త పోయిన శోకంతో మ్లానమై బొట్టులేక కళా విహీనమైన విధవ మొహంలా కప్పులకి వేడికి నల్లబడ్డ గోడలతో మాలపల్లె బోసిపోయింది

దారీ తెన్నూ తోచని ప్రజల భవిష్యత్తును తల్చుకుని గోల పెడుతున్నారు

ప్రెసిడెంటుగారొచ్చారు

ప్రగాఢ సంతాపం వెలిబుచ్చి-

"బాధ పడకండి, జరిగిందేదో జరిగిపోయింది నేనున్నా' నన్నాడు..

సొంత ఖర్చులతో ( ) భోజనా లేర్పాటు చేసాడు

ప్రభుత్వం వాళ్లు ఇంటికి రెండేసి వందల చొప్పున ఇచ్చేటట్టు ఏర్పాటు చేస్తానన్నాడు.

ఆ సమయంలో దేముడిలా కనిపించాడు వాళ్లకి

* * *

ఓటువేసే రోజొచ్చింది...

ఏ గుర్తుమీద 'ముద్ర' ఎలా వెయ్యాలో వివరించాడు ప్రెసిడెంటు— మాలపల్లె ప్రజలకి.

పోలింగు ముగిసింది...

ఫలితాలొచ్చాయి...

చర్విత చర్వణమైన చరిత్ర తత్త్వానికి చిర్నవ్వు నవ్వుకున్నాడు ప్రెసిడెంటు.

ఈ 'చర్విత చర్వణం' కథా రచనకు కొన్ని సలహాలనిచ్చిన మిత్రుడు, ప్రముఖ నవలా రచయిత — శ్రీ జి. సత్యమూర్తికి నా 'అభిమాన పుష్పం'గా అందజేస్తున్నాను.

— రచయిత